క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



దాచేపల్లి: తంగెడ గ్రామంలో బ్రెయిన్ హేమరేజ్ వ్యాధితో బాధ పడుతున్న పదేళ్ల లహరిరెడ్డి అనే చిన్నారి వైద్య ఖర్చులకు వారధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తగరం ఆనంద్ కుమార్ రూ.10 వేల నగదు గురువారం అందజేశారు. సర్పంచ్ కొత్తపల్లి కాశయ్య, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, ఎంపీటీసీ పోతుల కమలకుమారి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టులు



దాచేపల్లి: ముత్యాలంపాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన కోలాటం ప్రదర్శించే విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే ప్రత్యేక టీ షర్టులను మేడ మట్టారెడ్డి అనే వ్యక్తి గురువారం అందజేశారు. స్థానికులు బొమ్మారెడ్డి కోటిరెడ్డి, చిటిమిరెడ్డి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు బళ్ల మేరిశ్యాంకుమారి, ఆడేపు రాజేష్, గుదిబండి శ్రీనివాసరెడ్డి, అజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం



మాచర్ల: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, సిబ్బందికి సత్యసాయి పాఠశాల నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. నారాయణ సేవలో భాగంగా పాఠశాల తరఫున ప్రతి గురువారం ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గురజాల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

వైద్యానికి ప్రాధాన్యం



గురజాల: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందిస్తోందని ఎంపీడీఓ ఆర్. ఫణికుమార్ పేర్కొన్నారు. నాగార్జున నగర్‌లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యురాలు డాక్టర్ పద్మావతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చర్లగుడిపాడు పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, చర్లగుడిపాడు సర్పంచ్ తదితరులున్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి.. దరఖాస్తు చేసుకోవాలి

గురజాల: తల్లిదండ్రులను కోల్పోయి, నిరాదరణకు గురైన 18 సంవత్సరాలలోపు విద్యార్థులను గుర్తించి మిషన్ వాత్సల్య పథకం కింద ప్రతి నెల రూ.4వేలు నగదు అందజేసి, భరోసా కల్పిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జిల్లా, మండల స్థాయిల అధికారులతో సమీక్షాసమావేశాలు నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు మిషన్ వాత్సల్య పథకం లబ్ధికి ఈ నెల 30 లోపు దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందించాలని తెలిపారు.

పువ్వాడ హెచ్‌ఎం, ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నూజెండ్ల : విధి నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయునితో పాటు, మరో ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు నూజెండ్ల ఎంఈఓ సాంబశివరావు గురువారం తెలిపారు. నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న నాగుల షరీఫా, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శశి సుమంత్ ఇరువురు విద్యార్థుల ముందు ఘర్షణ పడుతూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎంఈఓ జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించారు. గురువారం సాయంత్రం శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

దాచేపల్లిలో ఉర్దూ యూనివర్శిటీకి కృషి

- రెండు నెలల్లో స్థలం కేటాయింపునకు చర్యలు
- రూ.80లక్షలతో షాదీఖానా నిర్మాణ పనులు
- ఈద్గాను కూడా ఏర్పాటు చేస్తాం
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ఉర్దూ యూనివర్శిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు గురువారం ఏర్పాటు చేశారు. స్థానిక మర్కస్ మసీద్‌లో ఎమ్మెల్యే కాసు మత పెద్దలతో కలిసి దువ్వా చేశారు. అనంతరం షాదీఖానా వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లిం మత పెద్దలు, నాయకులందరూ ఉర్దూ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 800 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, ఉర్దూ యూనివర్శిటీని కూడా ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. యూనివర్శిటీకి అవసరమైన స్థలాన్ని రెండు నెలల్లోనే కేటాయిస్తామని, సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి యూనివర్శిటీ ఏర్పాటు చేసేలా పనిచేస్తానని ఆయన వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాచేపల్లిలోని ముస్లింలకు షాదీ ఖానా కూడా లేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.80లక్షలతో షాదీ ఖానా నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. మరో రెండు నెలల్లో పనులను పూర్తి చేసి, భవనాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ముస్లింలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే కాసు స్పష్టం చేశారు. రూ.15లక్షల వ్యయంతో కబరస్తాన్‌ను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. నారాయణపురంలో ఈద్గాను నిర్మిస్తున్నామని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్ ఇవ్వటంతో డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ముస్లిం విద్యార్థులు రాణిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం మసీదులో పనిచేస్తున్న మౌలనా, మౌజన్, ముస్తాఫాలకు ఎమ్మెల్యే కాసు నూతన వస్త్రలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ సైదావలి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, మాజీ ఎంపీటీసీ పులకొట్లు జాను, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కమిటీ సభ్యులు అబ్దాలి, షేక్ పెద లాల, సయ్యద్ మౌలాలీ, షేక్ దాడీ, షేక్ సైదా, కొత్వాల్ సైదా, షేక్ పాప పాల్గొన్నారు.

సంక్షేమానికి జవాబుదారీతనం ‘మన ప్రభుత్వం’

‘గడప గడపకు’ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సంక్షేమ బుక్‌లేట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు జవాబుదారీతనం వహిస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. కరాలపాడు గ్రామ సచివాలయ పరిధిలోని 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముస్లిం బజారులో ఆయన గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేలు చేకూరిందో లెక్కలతో సహా ప్రతి కుటుంబానికి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి వివరించారు. గత ప్రభుత్వం గురజాల నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేసిందో ప్రజలు గుర్తించారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉంటే ప్రతి పక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. పల్నాడు నడిబొడ్డున రూ.500 కోట్లతో 800 పడకల మెడికల్ హాస్పిటల్‌ను నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే కాసు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో మెడికల్ కాలేజ్ నిర్మించటంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రాబోతుందన్నారు. కరాలపాడు గ్రామానికే సుమారు రూ.19 కోట్లకు పైగా నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కాశయ్య, సెక్రటరీ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, గడ్డం వలి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, వైఎస్ ఎంపీపీలు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సాతులూరి బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు సత్తార్ సీతారామిరెడ్డి, బుర్రి సీతారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నంబూరి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, పల్నాడు యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇల్లూరి వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ అన్నబోతుల గురవారెడ్డి, మాజీ సర్పంచ్ బుర్రి వెంగళరెడ్డి, ముడేల శ్రీనివాస్‌రెడ్డి, ముడేల సుబ్బారెడ్డి, మద్దసాని రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ భూమిరెడ్డి యల్లారెడ్డి, గ్రామ కన్వీనర్ అబ్దుల్లా, మాబు, వలి, ఇల్లూరి పుల్లారెడ్డి, ముడేల వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, తంగిరాల వెంకట రామిరెడ్డి, మాదాల జగన్, మునలయ్య, కోటా కిరణ్, బుర్రి కృష్ణారెడ్డి, బుర్రి రంగారెడ్డి, పెంటు, షేక్ గౌషారి, చింతపల్లి అబ్బాస్, ఆర్‌ఎంపీ శంకర్ పాల్గొన్నారు.

నర్సరీ లైసెన్స్‌కు.. నిబంధనలు తప్పనిసరి



నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి సురేష్

వెల్దుర్తి: నర్సరీ యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖాధికారి సురేష్ పేర్కొన్నారు. గురువారం మండాది గ్రామంలోని షెడ్ నెట్ నర్సరీలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నర్సరీ లైసెన్స్ కోసం షెడ్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు నెట్‌తో రక్షణ కల్పించాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ప్యాకెట్ మీద విత్తన రకం, కంపెనీ లేబుల్‌ను గమనించాలని సూచించారు. ఒరిజినల్ రసీదులను భద్రపరుచుకొని నర్సరీ రిజిస్టర్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్‌లు లేని వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటే తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతులకు నాసిరకరం నారు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిరప విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, నర్సరీ యజమానులు, విహెచ్‌ఏ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఈ నెల 26, 27న మహిళా కోలాట ప్రదర్శన పోటీలు

28న నాటు పొట్టేళ్ల బల ప్రదర్శన

రెంటచింతల: తెలుగు రాష్ట్రాల స్థాయిలో మహిళల కోలాట ప్రదర్శన పోటీలు ఈ నెల 26 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. రెంటచింతలలో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. తెలంగాణలోని సూర్యాపేట మండలం మఠంపల్లి గ్రామంలో 25న జరిగే శుభవార్త దేవాలయ తిరుణాళ్ల సందర్భంగా దేవాలయం ఆవరణలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళల కోలాటంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు అని ఆయన తెలిపారు. అలాగే వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు ఎనిమిదవ బహుమతి వరకు నగదు ప్రదానం ఉంటుందని చెప్పారు. 28న స్థానిక మాంట్‌ఫోర్టు స్కూల్ ఆవరణలో నిర్వహించనున్న పొట్టేళ్ల పోటీల్లోని విజేతలకు కూడా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున వరుసగా బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25 లోపు పేరు నమోదు చేసుకుని, ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9618764924, 9848984603, 9182568951 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రజల నమ్మకం సీఎం వైఎస్ జగన్



పిడుగురాళ్ల పట్టణం.. 14వ వార్డులో ప్రచారం



ఒప్పిచర్లలో స్టిక్కర్లతో వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు తమ నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్ తీర్చిదిద్దే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఇంటి వద్దకు వస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులకు స్పష్టం చేస్తున్నారు. వారిని సాదరంగా ఆహ్వానించి, ‘మా నమ్మకం నువ్వే జగన్’ అంటూ స్టిక్కర్లను ఇంటికి అంటిస్తున్నారు. ప్రభుత్వం సక్షేమ పథకాల వద్ద తాము ఎంత లబ్ధి పొందినది స్వయంగా వివరిస్తున్నారు. గురువారం ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమంలో ఉత్సాహంగా సాగింది.

పిడుగు రాళ్ల పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్ పులి వెంకటబాల కాశీ ప్రతి ఇంటిటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్ చింతల జానకి రామయ్య యాదవ్, కొంగని రమణా యాదవ్ పాల్గొన్నారు. 3వ వార్డులో వార్డు ఇన్‌చార్జి పాశం వెంకటేశ్వరరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు, మాదాల కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, టౌన్ యూత్ అధ్యక్షులు గొట్టి ముక్కల పవన్‌రెడ్డి, పుణ్యాల చంద్రారెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి, సైదారెడ్డి, సంజీవరెడ్డి, నరసింహారావు, అంకిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశేష స్పందన..

కారెంపూడి: పెదకొదమ గుండ్ల, నరమాల పాడు, కాచవరం, ఇనుపరాజు పల్లె, చినకొదమ గుండ్ల, బ్రహ్మనాయుడు కాలనీ, కాకానివారి పాలెం, రెడ్డిపాలెం, బట్టువారిపల్లె, లక్ష్మీపురం గ్రామాలలో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని మండల సచివాలయ కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఒప్పిచర్ల గ్రామంలో మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికీ స్టిక్కర్లు

వెల్దుర్తి: చినపర్ల పాయి తండాలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. బుజ్జిబాయి, బాలునాయక్, దేవీలాల్, రాజా, రవీందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

దుర్గి: తేరాల గ్రామంలో సర్పంచ్ చౌకాల బ్రహ్మయ్య, పుచ్చకాయల ఏడుకొండలు, రామకృష్ణ, సింగం శ్రీనివాస్ యాదవ్, పుచ్చకాయల కొండలు, సాయి పలువురు నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పర్యటించి, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు.

పీజీ కోర్సులపై అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ అనిత

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని వివిధ కళాశాలలో విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సదస్సులలో అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ డిగ్రీ అనంతరం పీజీ కోర్సులను చదవటం వలన కలిగే ప్రయోజనాలను తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు, క్రీడలకు వర్సిటీ ఇస్తున్న ప్రాధాన్యత, డాక్టరేట్ చేసేందుకు ఉన్నటువంటి అవకాశాలు, హాస్టల్ వసతి, తదితర అంశాలను వివరించారు. ఏపీ పీజీ సెట్–2023పై అవగాహన కలిగించారు. పీజీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అడ్మిషన్ల వివరాలను తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల, పీఎన్‌సీ అండ్ కె.ఆర్.డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన సదస్సులలో వర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీ, సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎం.త్రిమూర్తిరావు, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఐదు వాహనాలు స్వాధీనం



నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ విజయ భాస్కరరావు, టూటౌన్ సీఐ వీరేంద్రబాబులు తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై తమ్మిశెట్టి శివనాగరాజు, దారపనేని వెంకట సాంబశివరావు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంబడించి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా ద్విచక్రవాహనాలు దొంగలించి విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు నేరాన్ని అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో చోరీకి గురైన ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువకుడి ప్రాణాలు తీసిన అప్పులు



నరసరావుపేట రూరల్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రావిపాడులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు రావిపాడు గ్రామానికి చెందిన అముదాల వెంకట శ్రీనివాసరావు (31) గతంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కార్యాలయ సిబ్బందిగా పనిచేసేవాడు. తన తండ్రి ఆరోగ్యం దెబ్బతినడంతో ఆయనకు తోడుగా కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. తండ్రి ఆసుపత్రి ఖర్చుల కోసం అప్పులు కావడంతో పాటు వ్యవసాయం కూడా కలిసి రాకపోవడంతో అప్పుల భారం పెరిగింది. దీంతో ఈనెల 19వ తేదీ బుధ వారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసరావు వల్లప్పచెరువు నుంచి కేతముక్కల అగ్రహారం వెళ్లేదారిలో పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి భార్య చంద్రకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై సర్పంచ్, ఎంపీడీవోను స్వయంగా కలిశారు.

ప్రార్థన స్థలాల పవిత్రత కాపాడాలి

చిలకలూరిపేట: ప్రార్థనా స్థలాల పవిత్రత కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నం లోని ఈద్గా మైదానాలను మున్సిపల్ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఆక్రమణలను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, టీపీఎస్ కె సునీత, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌అలీ, 27వార్డు ఇన్‌చార్జి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలకు అవగాహన

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



పిడుగురాళ్ల: అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉందన్నారు. అగ్నిప్రమాదాలకు గల కారణాలు, వాటిని ఎలా అదుపు చేయాలో అవగాహన కలిగి ఉండాలని మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సీఎంఎం జి. శ్రీనివాసరావు అగ్నిప్రమాదాలను ఏ విధంగా ఎదుర్కోవాలో వాల్ పేపర్ల ద్వారా వివరించారు. సీవోలు శ్రీనివాసరావు, బాల ఆంజనేయులు, సిబ్బంది పీవీ రమణ, శ్రీనివాసరెడ్డి, మరియ దాసు, బాద్షా, భాస్కర్‌రెడ్డి, ధర్మనాయక్, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు నాయక్, పిచ్చయ్య, రమారావు, కె. శ్రీనివాసరావు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు



చలివేంద్రం వద్ద కరుణాకర్‌రెడ్డి తదితరులు

గురజాల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని గురువారం తహసీల్దార్ ఎం.దానియేలు ప్రారంభించారు. పల్నాడు ప్రాంతంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రంలో నీటిని తాగాలన్నారు. రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

ప్రయాణికుల కోసం..

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డు, రైల్వే గేటు సమీపంలో కరుణాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఉచిత చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలు సాగు చేసేముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, ఎరువులు వాడాలని మండల వ్యవసాయశాఖాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాలపై రైతులు ఒక అవగాహన కలిగి ఉండటం ఎంతో ప్రయోజనమని ఆయన చెప్పారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏఓ సమావేశం నిర్వహించారు. సూక్ష్మ పోషక లోపాలున్నట్లయితే.. పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని రైతులకు సూచించారు. సూక్ష్మపోషకాలైన.. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని స్పష్టం చేశారు. ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే.. పెట్టుబడి కూడా తగ్గుతుందని ఏఓ వివరించారు. సూక్ష్మ పోషకాల లోపాల వల్ల వచ్చే తెగుళ్ల నివారణా సస్యరక్షణ చర్యలు రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, గొట్టం లక్ష్మారెడ్డి రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అధికారుల ‘బడి నిద్ర’



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వరావు

విజయపురిసౌత్: కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు విజయపురిసౌత్ గ్రామంలోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు, అధికారులు గురువారం బడి నిద్ర చేశారు. పాఠశాలలో వంట శాలను తనిఖీ చేశారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నారా..? లేదా..? అని విద్యార్థులను ఆరా తీశారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఈఓ వేముల నాగయ్య, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనునాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం సర్పంచ్‌గా చెన్నమ్మ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా యాగసిరి చెన్నమ్మను నియమాకం ధృవీకరణ పత్రాన్ని అందజేసినట్లు ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించిన రాపూరి వెంకాయమ్మ దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళగా జిల్లా పంచాయతీ అధికారి అదేశాలు మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న యాగసిరి చెన్నమ్మను సర్పంచ్‌గా నియమాకం చేసినట్లు చెప్పారు. ధృవీకరణ పత్రం అందుకున్న వారిలో మండల కోఆప్షన్ సభ్యు లు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి రవి, బాబు, కొణతం ఎరుకల రెడ్డి, ఏసురాజు, పొట్టిపాటి శ్రీను ఉన్నారు.

నేడు వీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

దాచేపల్లి : ముత్యాలంపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల రాక నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. అన్నదానం చేయనున్నారు.